ప్రగతికి మూలం... విజ్ఞానశాస్త్ర పరిశోధనలే. ఇందులో భాగం కావాలనుకున్నవారు జాతీయ స్థాయిలో పేరున్న విద్యాసంస్థలో సీటు పొందాలి. ఎన్‌టీఏ నిర్వహించే సీఎస్‌ఐఆర్ యూజీసీ నెట్ ఇందుకు అత్యుత్తమ వేదిక. ఈ పరీక్షలో అర్హత పొందితే స్టైపెండ్‌తో కూడిన పరిశోధనల దిశగా అడుగులేయవచ్చు. భవిష్యత్తు శాస్త్రవేత్తగా అవతరించవచ్చు. అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకూ పోటీ పడవచ్చు. ఇటీవలే ప్రకటన వెలువడిన నేపథ్యంలో ఆ వివరాలు...

ప్రయోజనాలు

జేఆర్‌ఎఫ్‌కు ఎంపికై, పరిశోధనల్లో చేరినవారికి తొలి రెండేళ్లు ప్రతి నెలా రూ.31,000 స్టైపెండ్ ఇస్తారు. అనంతరం ఎస్‌ఆర్‌ఎఫ్ అర్హత సాధించినవారికి ప్రతి నెలా రూ.35,000 చొప్పున అందుతుంది. దీంతోపాటు ఉచిత వసతి లేదా స్టైపెండ్‌లో 30 శాతం హెచ్‌ఆర్‌ఏ కింద అదనంగా చెల్లిస్తారు.

నెట్ లెక్చరర్‌షిప్‌నకు అర్హత పొందినవారు, జేఆర్‌ఎఫ్‌కు ఎంపికైనవాళ్లు.. విశ్వవిద్యాలయాలు, డీమ్డ్ సంస్థల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు పోటీ పడవచ్చు. అలాగే వీరు డిగ్రీ కళాశాలల్లో లెక్చరర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు.



సైన్స్‌లో సత్తా చాటాలని ఉందా?

ప్రామాణిక పరిశోధనలకు సీఎస్‌ఐఆర్ నెట్

ఏడాదికి రెండుసార్లు కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చ్ (సీఎస్‌ఐఆర్) - యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) తరపున నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో నేషనల్ ఎలిజిబిలిటీ టెస్టు (నెట్) నిర్వహిస్తున్నారు. సీఎస్‌ఐఆర్‌కు దేశవ్యాప్తంగా ఎన్నో ప్రయోగశాలలున్నాయి. వీటిలో పరిశోధనలు కొనసాగించుకునే అవకాశం జూనియర్ రిసెర్చ్ ఫెలోషిప్ (జేఆర్‌ఎఫ్)తో లభిస్తుంది. సైన్స్, ఇంజినీరింగ్‌లో నాలుగేళ్ల యూజీ కోర్సులు లేదా పీజీ పూర్తిచేసుకున్నవారు, ప్రస్తుతం ఆఖరు సంవత్సరం చదువుతున్న వాళ్లు పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఏ సబ్జెక్టులు?

● కెమికల్ సైన్సెస్ ● ఎర్త్, అట్మాస్ఫిరిక్, ఓషన్, ప్లానిటరీ సైన్సెస్ ● లైఫ్ సైన్సెస్ ● మేథమెటికల్ సైన్సెస్ ● ఫిజికల్ సైన్సెస్

అభ్యర్థులు చదువుకున్న కోర్సు ప్రకారం వీటిలో ఏదో ఒక సబ్జెక్టులో పరీక్ష రాయాలి. నాలుగేళ్ల యూజీ కోర్సులైన బీఈ, బీఎస్, బీఫార్మసీ...మొదలైనవి చదువుకున్నవారికి జేఆర్‌ఎఫ్ అవకాశం ఉంది. అయితే వీరు లెక్చరర్‌షిప్‌నకు అనర్హులు.

పరీక్ష విధానం

అభ్యర్థి ఎంచుకున్న సబ్జెక్టు నుంచి 200 మార్కులకు ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహిస్తారు. ప్రశ్నలన్నీ మల్టిపుల్ చాయిస్ విధానంలో ఉంటాయి. పరీక్ష వ్యవధి 3 గంటలు. ఇందులో మూడు విభాగాలు (ఎ, బి, సి) ఉంటాయి.

పార్ట్ ఎ: అన్ని విభాగాల వారికీ ఉమ్మడిగా ఉంటుంది. ఇందులో జనరల్ ఆప్టిట్యూడ్‌లో లాజికల్ రీజనింగ్, గ్రాఫికల్ అనాలిసిస్, అనలిటికల్ అండ్ న్యూమరికల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ కంపారిజన్, సిరీస్ ఫార్మేషన్, పజిల్స్ మొదలైన అంశాల్లో 20 ప్రశ్నలు వస్తాయి. వీటిలో ఏవైనా 15 ప్రశ్నలకు సమాధానాలు గుర్తిస్తే సరిపోతుంది. ఈ విభాగానికి 30 మార్కులు. ప్రతి సరైన సమాధానానికి 2 మార్కులు. తప్పు సమాధానానికి అర మార్కు తగ్గిస్తారు.

పార్ట్ బి: ఈ విభాగంలో అభ్యర్థి ఎంచుకున్న సబ్జెక్టు నుంచి ప్రశ్నలు వస్తాయి. ఆ సబ్జెక్టు ప్రకారం ప్రశ్నల సంఖ్య మారుతుంది. సబ్జెక్టుల్లో 25 నుంచి 50 వరకు ప్రశ్నలు ఉంటాయి. చాయిస్ ఉంది. ఈ విభాగానికి ఆ సబ్జెక్టు ప్రకారం 70 లేదా 75 మార్కులు ఉంటాయి. రుణాత్మక మార్కులు ఉన్నాయి. ప్రశ్నకు కేటాయించిన మార్కుల్లో పావు వంతు చొప్పున తగ్గిస్తారు.

పార్ట్ సి: ఎంచుకున్న సబ్జెక్టు నుంచి 30 నుంచి 80 వరకు ప్రశ్నలు వస్తాయి. చాయిస్ ఉంది. మ్యాథ్స్‌లో 95 మిగిలిన సబ్జెక్టుల్లో వంద మార్కులకు ఈ ప్రశ్నలు ఉంటాయి. మ్యాథ్స్ తప్ప మిగిలిన వాటికి రుణాత్మక మార్కులు ఉన్నాయి. ప్రశ్నకు కేటాయించిన మార్కుల్లో పావు వంతు చొప్పున తగ్గిస్తారు. సైంటిఫిక్ కాన్సెప్టులపై అభ్యర్థికి ఉన్న అవగాహన, పరిజ్ఞానం, అనువర్తిత ధోరణి మొదలైన అంశాల్లో ప్రశ్నలు అడుగుతారు. ఈ ప్రశ్నలన్నీ అభ్యర్థి విశ్లేషణ సామర్థ్యాన్ని పరీక్షించేలా ఉంటాయి.

మొత్తం ప్రశ్నపత్రం నుంచి సబ్జెక్టులవారీ.. ఫిజికల్ సైన్సెస్‌లో 75 ప్రశ్నలకు 55, మ్యాథమెటికల్ సైన్సెస్‌లో 120కి 60, లైఫ్ సైన్సెస్‌లో 145కి 75, కెమికల్ సైన్సెస్‌లో 120కి 75, ఎర్త్, అట్మాస్ఫిరిక్, ఓషన్ అండ్ ప్లానిటరీ సైన్సెస్‌లో 150కి 75 ప్రశ్నలకు సమాధానాలు గుర్తిస్తే సరిపోతుంది. సిలబస్, మాదిరి ప్రశ్నపత్రాలను https://www.csirhrdg.res.in/ నుంచి పొందవచ్చు.

సన్నద్ధత ఎలా?

1. ఈ పరీక్షలో విజయానికి ప్రాథమికాంశాలపై పట్టుతోపాటు సబ్జెక్టుపై లోతైన అవగాహన ఉండాలి. ప్రతి అంశాన్నీ క్షుణ్నంగా చదివితేనే జవాబు గుర్తించగలం. ఎక్కువ ప్రశ్నలు నేరుగా కాకుండా రెండుమూడు అంశాలపై ముడిపడి ఉంటాయి. అలాగే కొన్ని అనువర్తనానికి సంబంధించీ ఉంటాయి. అందువల్ల మొత్తం సిలబస్ శ్రద్ధగా చదవడం తప్పనిసరి.
2. సబ్జెక్టులవారీ సిలబస్ వివరాలు ఇచ్చారు. వాటిని గమనించాలి. సన్నద్ధతను దీనికి అనుగుణంగా కొనసాగించాలి.
3. తేలిక, మధ్యస్థం, కఠినం... ఇలా సిలబస్‌ను విడదీయాలి. కఠినమైన అంశాలకు ఎక్కువ సమయం వెచ్చించాలి. కాస్త ఫర్వాలేదు అనిపించినవాటిని మరోసారి రివిజన్ చేసుకోవాలి.
4. పాత ప్రశ్నపత్రాలను సునిశితంగా పరిశీలించాలి. ఏ అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి, వాటిని ఏ స్థాయిలో చదవాలో తెలుసుకుని, అమలు చేయాలి.
5. సంబంధిత సబ్జెక్టులో ప్రాథమికాంశాలపై పట్టుకోసం సబ్జెక్టుకు చెందిన యూజీ పాఠ్యపుస్తకాలు బాగా చదవాలి. ఆ తర్వాత అనువర్తన, పరిశోధన కోణంలో సన్నద్ధత కొనసాగించాలి.
6. చాప్టర్లవారీగా పీజీ స్థాయిలో రిఫరెన్స్ పుస్తకాలు లోతుగా అధ్యయనం చేయడం తప్పనిసరి.
7. అన్ని సబ్జెక్టుల్లోనూ పార్ట్ సి విభాగానికి ఎక్కువ వెయిటేజీ ఉంది. ఇందుకోసం ప్రామాణిక పుస్తకాలు, పరిశోధన జర్నల్స్‌ను అనువర్తిత ధోరణిలో అధ్యయనం చేయాలి.
8. సన్నద్ధత పూర్తయిన తర్వాత కనీసం పది మాక్ పరీక్షలు రాసి, ఫలితాలు విశ్లేషించుకోవాలి. బలహీనంగా ఉన్న అంశాలను గుర్తించి, వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఇలా ప్రతి పరీక్ష తర్వాత సమీక్షించుకుని, సన్నద్ధతను మెరుగుపరచుకోవాలి. పరీక్ష రాస్తున్నప్పుడు సమయానికీ ప్రాధాన్యమివ్వాలి.
9. రుణాత్మక మార్కులున్నాయి. కాబట్టి తెలియని ప్రశ్నలను వదిలేయడమే మంచిది.

ఏ అంశాలు ముఖ్యం?

▼ **లైఫ్ సైన్సెస్:** బోటనీ లేదా జువాలజీలో పీజీ పూర్తిచేసుకున్నవాళ్లు ఆధునిక బయాలజీ (మాలిక్యులార్ బయాలజీ, బయోటెక్నాలజీ, బయోకెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, బయోకెమికల్ టెక్నిక్స్, బయోఫిజిక్స్, స్పెక్ట్రోస్కోపీ) పై ఎక్కువ శ్రద్ధ పెట్టాలి. ఆధునిక బయాలజీలో పీజీ చేసినవారు క్లాసికల్ బయాలజీ, ఎకాలజీ, ఎవల్యూషన్, బయోడైవర్సిటీపై ఎక్కువ దృష్టి సారించాలి.

▼ **కెమికల్ సైన్సెస్:** ఆర్గానిక్ కెమిస్ట్రీలో.. రియాక్షన్ మెకానిజం, స్టీరియో కెమిస్ట్రీలో ఎనెంటియోసెలెక్టివ్ సింథసిస్, కన్ఫర్మేషనల్ అనాలిసిస్, ఆర్గానిక్ స్పెక్ట్రోస్కోపీ, రియేజెంట్స్, పెరిసైక్లిక్ చర్యలు, కాంతి రసాయనశాస్త్రం తదితర అంశాలనూ, ఇనార్గానిక్ కెమిస్ట్రీలో.. సంశ్లిష్ట సమ్మేళనాలు, అనలిటికల్ కెమిస్ట్రీ, బయో ఇనార్గానిక్ కెమిస్ట్రీ, కర్బన లోహ సమ్మేళనాలు, మెటల్ క్లస్టర్స్ మొదలైన అంశాలనూ అనువర్తిత ధోరణిలో విశ్లేషణాత్మకంగా చదవాలి. ఫిజికల్ కెమిస్ట్రీలో.. క్వాంటమ్ కెమిస్ట్రీ, సాలిడ్‌స్టేట్, మాలిక్యులర్ స్పెక్ట్రోస్కోపీ, స్టాటిస్టికల్ థర్మోడైనమిక్స్, కెమికల్ కైనెటిక్స్, ఎలక్ట్రో కెమిస్ట్రీ మొదలైన అంశాలను అనువర్తిత ధోరణిలో అధ్యయనం చేయాలి.

▼ **ఫిజికల్ సైన్సెస్:** మోడరన్ ఫిజిక్స్, న్యూక్లియర్, పార్టికల్ ఫిజిక్స్, హీట్, థర్మోడైనమిక్స్ (క్లాసికల్, స్టాటిస్టికల్), ఎలక్ట్రోమాగ్నటిక్ థియరీ, ఎలక్ట్రానిక్స్ అండ్ ఎక్స్‌పరిమెంటల్ మెథడ్స్, ఆప్టిక్స్, మెకానిక్స్ విభాగాలను క్షుణ్నంగా చదవాలి.

▼ **మేథమెటికల్ సైన్సెస్:** స్టాటిస్టిక్స్, ఎక్స్‌పోలేటరీ డేటా అనాలిసిస్, కాంప్లెక్స్, డిఫరెన్షియల్ అనాలిసిస్, మ్యాట్రిక్స్, డెరివేటివ్స్, వెక్టర్, త్రికోణమితి, జామెట్రీ పార్యాంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి.

▼ **ఎర్త్, అట్మాస్ఫిరిక్, ఓషన్, ప్లానిటరీ సైన్సెస్:** భూమి, సౌరవ్యవస్థ, సముద్రాలు, వాతావరణం, పర్యావరణం, భూగర్భ శాస్త్రం, జియో కెమిస్ట్రీ, ఎకనామిక్ జియాలజీ, ఫిజికల్ జాగ్రఫీ, జియో ఫిజిక్స్, మెటీరియాలజీ, ఓషన్ సైన్స్ అంశాలను పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలి.

గమనించండి!

అర్హత: ఎంఎస్‌సీ లేదా ఇంటిగ్రేటెడ్ ఎంఎస్‌సీ లేదా బీఈ/బీటెక్ లేదా నాలుగేళ్ల బీఎస్సీ లేదా బీఫార్మసీ తదితర కోర్సుల్లో 55% మార్కులతో ఉత్తీర్ణులైన జనరల్, ఓబీసీలు, 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన ఎస్సీ, ఎస్టీ, థర్డ్ జండర్, దివ్యాంగులు దరఖాస్తు చేసుకోవచ్చు. చివరి ఏడాది కోర్సులు చదువుతున్నవారూ అర్హులే.
వయసు: జేఆర్‌ఎఫ్‌కు గరిష్ఠ వయసు పరిమితి జులై 1, 2022 నాటికి 28 ఏళ్లు. ఎస్సీ, ఎస్టీ, థర్డ్ జెండర్, దివ్యాంగులు, మహిళలకు ఐదేళ్లు, నాన్ క్రీమిలేయర్ ఓబీసీలకు మూడేళ్లు మినహాయింపు వర్తిస్తుంది. లెక్చరర్‌షిప్ (ఎల్ ఎస్)కు ఏ వయసువారైనా దరఖాస్తు చేసుకోవచ్చు.
ఆన్‌లైన్ దరఖాస్తులు: ఏప్రిల్ 10 సాయంత్రం 5 వరకు స్వీకరిస్తారు.
పరీక్ష ఫీజు: జనరల్ కేటగిరీకి రూ.1100, ఓబీసీ- నాన్ క్రీమీ లేయర్‌కు రూ.550, ఎస్సీ/ఎస్టీ/ థర్డ్ జండర్‌లకు రూ.275. దివ్యాంగులు ఫీజు చెల్లించనవసరం లేదు.
పరీక్షలు: జూన్ 6,7,8 తేదీల్లో.
పరీక్ష కేంద్రాలు: ఏపీలో.. అనంతపురం, భీమవరం, చీరాల, చిత్తూరు, ఏలూరు, గుంటూరు, కడప, కాకినాడ, కర్నూలు, నరసరావుపేట, నెల్లూరు, ఒంగోలు, పొద్దుటూరు, రాజమహేంద్రవరం, శ్రీకాకుళం, సూరంపాలెం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం. తెలంగాణలో.. హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, నల్గొండ, వరంగల్.
వెబ్‌సైట్: https://csirnet.nta.nic.in/

సీపీసీబీలో 163 పోస్టులు

దిల్లీలోని భారత ప్రభుత్వరంగ సంస్థ అయిన సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ (సీపీసీబీ)ను కాలుష్య నియంత్రణకు ఏర్పాటుచేశారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణం కాలుష్యం బారినపడకుండా కాపాడటమే దీని లక్ష్యం. ఈ సంస్థ తాజాగా 163 పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.

రాత పరీక్ష, స్కిల్/ ట్రేడ్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. రాత పరీక్షలో కనీసార్హత మార్కులు పొందిన అభ్యర్థులను మాత్రమే తదుపరి దశకు ఎంపికచేస్తారు.

ఏ అర్హతలు?

1. సైంటిస్ట్-బి పోస్టులకు సివిల్/కెమికల్/ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్‌లో డిగ్రీ ఉండాలి. ఇంజినీరింగ్/టెక్నాలజీలో మాస్టర్స్ డిగ్రీ ఉన్నవారికి ప్రాధాన్యం. లేదా కెమిస్ట్రీ/ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌లో మాస్టర్స్ డిగ్రీ, నెట్ అర్హత/ పీహెచ్‌డీ ఉన్నవారికి ప్రాధాన్యం.
2. సీనియర్ సైంటిఫిక్ అసిస్టెంట్ పోస్టుకు సైన్స్‌లో మాస్టర్స్ డిగ్రీ, సంబంధిత రంగంలో రెండేళ్ల అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం.
3. అప్పర్ డివిజన్ క్లర్క్ పోస్టుకు డిగ్రీ ఉండాలి. కంప్యూటర్‌పై ఇంగ్లిష్‌లో నిమిషానికి 35 పదాలు లేదా హిందీలో 30 పదాలు టైప్ చేయగలగాలి.
4. జూనియర్ ల్యాబొరేటరీ అసిస్టెంట్ పోస్టుకు సైన్స్ సబ్జెక్టుతో ఇంటర్మీడియట్ పాసవ్వాలి. సైన్స్ సబ్జెక్టుతో డిగ్రీ పాసైనవారికి ప్రాధాన్యమిస్తారు.
5. లోయర్ డివిజన్ క్లర్క్ పోస్టుకు ఇంటర్మీడియట్/తత్సమాన పరీక్ష పాసవ్వాలి. కంప్యూటర్‌పైన ఇంగ్లిష్‌లో నిమిషానికి 35 పదాలు లేదా హిందీలో 30 పదాలు టైప్ చేయగలగాలి.
6. ఫీల్డ్ అటెండెంట్ పోస్టుకు పదోతరగతి పాసవ్వాలి. సైన్స్ సబ్జెక్టుతో ఇంటర్మీడియట్ పాసవ్వాలి. ఈత వచ్చిన వారికి ప్రాధాన్యమిస్తారు.
7. మల్టీ టాస్కింగ్ స్టాఫ్ పోస్టుకు పదోతరగతి పాసవ్వాలి.

వయసు: సైంటిస్ట్ 'బి' పోస్టుకు గరిష్ఠ వయసు 35 సంవత్సరాలు. అసిస్టెంట్ లా ఆఫీసర్, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్, సీనియర్ సైంటిఫిక్ అసిస్టెంట్, టెక్నికల్ సూపర్‌వైజర్, అసిస్టెంట్, అకౌంట్స్ అసిస్టెంట్ పోస్టులకు గరిష్ఠ వయసు 30 సంవత్సరాలు. జూనియర్ టెక్నీషియన్, సీనియర్ ల్యాబొరేటరీ అసిస్టెంట్, అప్పర్ డివిజన్ క్లర్క్, డేటా ఎంట్రీ ఆపరేటర్, జూనియర్ ల్యాబొరేటరీ అసిస్టెంట్, లోయర్ డివిజన్ క్లర్క్, ఫీల్డ్ అటెండెంట్, మల్టీ టాస్కింగ్ స్టాఫ్ పోస్టులకు 18- 27 సం. మధ్య ఉండాలి.
రాతపరీక్ష: సైంటిస్ట్ బి పోస్టుకు నిర్వహించే రాత పరీక్ష 100 మార్కులకు, వంద ప్రశ్నలు ఉంటాయి. జనరల్ సైన్స్, జనరల్ ఇంగ్లిష్, జనరల్ ఆప్టిట్యూడ్ నుంచి 40 ప్రశ్నలు ఇస్తారు. సబ్జెక్టు ఆధారిత ప్రశ్నలు 60 ఉంటాయి. పరీక్ష సమయం 2 గంటలు.
● అసిస్టెంట్ పోస్టుకు నిర్వహించే రాత పరీక్షలో.. జనరల్ ఆప్టిట్యూడ్, ఎన్విరాన్‌మెంట్ జీకే, ఇంగ్లిష్, మాథ్స్‌కు సంబంధించిన అంశాల నుంచి ప్రశ్నలు ఇస్తారు. ఎన్‌సీఈఆర్‌టీ పదోతరగతి పాఠ్యపుస్తకాల ప్రామాణికంగా ప్రశ్నపత్రం ఉంటుంది. ● సీనియర్ ల్యాబొరేటరీ అసిస్టెంట్ రాతపరీక్షలో.. కెమిస్ట్రీ, మ్యాథ్స్/ బయాలజీ, జనరల్ ఆప్టిట్యూడ్, ఎన్విరాన్‌మెంట్ జీకే, ఇంగ్లిష్ అంశాల నుంచి ప్రశ్నలు ఇస్తారు. ● రాత పరీక్షకు సంబంధించిన పాత ప్రశ్నపత్రాలు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి.
దరఖాస్తుకు చివరి తేదీ: 31.03.2023
వెబ్‌సైట్: https://cpcb.nic.in/

తాజా ఇంటర్వ్యూలు

వర్క్ ఫ్రమ్ హోమ్

సేల్స్ డెవలప్‌మెంట్

సంస్థ: టాంగడైవ్ లిమిటెడ్
స్టైపెండ్: నెలకు రూ.5,000
దరఖాస్తు గడువు: మార్చి 24
అర్హతలు: సేల్స్ డెవలప్‌మెంట్ నైపుణ్యం, ఆసక్తి ఉన్న విద్యార్థులు
☛ internshala.com/i/42731c

ఫండ్‌రైజింగ్

సంస్థ: నయేపంఖ్ ఫౌండేషన్
స్టైపెండ్: నెలకు రూ.5,000-10,000
దరఖాస్తు గడువు: మార్చి 17
అర్హతలు: ఫండ్‌రైజింగ్ నైపుణ్యం, ఆసక్తి ఉన్న విద్యార్థులు
☛ internshala.com/i/689239

స్టాక్ మార్కెట్ మేనేజ్‌మెంట్

సంస్థ: ఎక్యూపర్స్
స్టైపెండ్: నెలకు రూ.1,000-4,000
దరఖాస్తు గడువు: ఏప్రిల్ 5
అర్హతలు: డిజిటల్ మార్కెటింగ్, సేల్స్ అండ్ మార్కెటింగ్, సేల్స్‌ఫోర్స్ నైపుణ్యాలు
☛ internshala.com/i/80e816

సోషల్ మీడియా మార్కెటింగ్

సంస్థ: కొరిజో ఎడ్యు-టెక్
స్టైపెండ్: నెలకు రూ.1,000
దరఖాస్తు గడువు: మార్చి 23
అర్హతలు: డిజిటల్ మార్కెటింగ్, ఈమెయిల్ మార్కెటింగ్, ఫేస్‌బుక్ మార్కెటింగ్, ఇన్‌స్టాగ్రామ్ మార్కెటింగ్, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-ఆఫీస్, సేల్స్ అండ్ మార్కెటింగ్, సోషల్ మీడియా మార్కెటింగ్ నైపుణ్యాలు
☛ internshala.com/i/1327dd

నోటిఫికేషన్స్

ప్రవేశాలు

దిల్లీ ఐఐటీలో పీజీ, పీహెచ్‌డీ

దిల్లీ ఐఐటీ పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రాం(మొదటి సెమిస్టర్)లలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.
1. పీహెచ్‌డీ
2. ఎంటెక్, ఎంఎస్(రిసెర్చ్), ఎం.డిజైన్, ఎంపీపీ, ఎంఎస్సీ (హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్)
విభాగాలు: అప్లైడ్ మెకానిక్స్, బయోకెమికల్ ఇంజినీరింగ్ అండ్ బయోటెక్నాలజీ, కెమికల్ ఇంజినీరింగ్, కెమిస్ట్రీ, సివిల్ ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, డిజైన్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, ఎనర్జీ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, మేనేజ్‌మెంట్ స్టడీస్ తదితరాలు.
అర్హత: పీజీ ప్రవేశానికి సంబంధిత విభాగంలో మొదటి శ్రేణిలో బ్యాచిలర్ డిగ్రీ; పీహెచ్‌డీ ప్రవేశాలకు సంబంధిత విభాగంలో మొదటి శ్రేణిలో పీజీ. ఇంజినీరింగ్ విభాగాలకు గేట్, డిజైన్ విభాగాలకు సీడ్ వ్యాలిడ్ స్కోరు ఉండాలి. ఎంఎస్సీ కాగ్నిటివ్ సైన్స్ ప్రోగ్రాంనకు గేట్/ జామ్, జేఆర్‌ఎఫ్, నెట్ వీటిలో ఏదైనా స్కోరు ఉండాలి
ఎంపిక: ప్రవేశ పరీక్ష/ ఇంటర్వ్యూ ఆధారంగా.
దరఖాస్తు రుసుము: రూ.200 (ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులు రూ.50 చెల్లించాలి).
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 30-03-2023.
పరీక్ష/ ఇంటర్వ్యూ తేదీలు: 16-05-2023 - 16-06-2023.
తరగతులు ప్రారంభం: 24-07-2023.
వెబ్‌సైట్: https://home.iitd.ac.in/

జేఎన్‌టీయూ కాకినాడలో పీహెచ్‌డీ తక్షణ ప్రవేశాలు

కాకినాడలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ ఏపీఆర్‌సీఈటీ- పీహెచ్‌డీ-2022 ప్రవేశాలకు సంబంధించి ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తోంది.
విభాగాలు: సివిల్, సీఎస్ఈ, ఈఈఈ, ఈసీఈ, ఐటీ, ఎంఈ, ఫిజిక్స్, బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, మ్యాథమెటిక్స్.
అర్హత: సంబంధిత సబ్జెక్టులో పీజీ, ఏపీఆర్‌సెట్-2022/ యూజీసీ- నెట్/ యూజీసీ- సీఎస్ఐఆర్- నెట్/ స్లట్/ గేట్/ జీప్యాట్ స్కోరు.
స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్ షెడ్యూల్: 17-03-2023.
వేదిక: సెనేట్ హాల్, యూనివర్సిటీ అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్, జేఎన్‌టీయూకే, కాకినాడ క్యాంపస్.
వెబ్‌సైట్: https://www.jntuk.edu.in/

ఉద్యోగాలు

సమీర్-ముంబయిలో సైంటిస్ట్‌లు

ముంబయిలోని సొసైటీ ఫర్ అప్లైడ్ మైక్రోవేవ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ అండ్ రిసెర్చ్(సమీర్) 21 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
1. **సైంటిస్ట్-బీ:** 18 పోస్టులు. బీఈ/ బీటెక్/ ఇంజినీరింగ్ డిగ్రీ/ మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణత.వయసు 30 ఏళ్లు మించకూడదు.
2. **సైంటిస్ట్-సీ:** 03 పోస్టులు. బీఈ/ బీటెక్/ ఇంజినీరింగ్ డిగ్రీ/ మాస్టర్స్‌డిగ్రీ/ ఎంటెక్/ ఎంఈ ఉత్తీర్ణత. అనుభవం: కనీసం 2-4 ఏళ్లు. **వయసు:** 35 ఏళ్లు మించకూడదు.
ఎంపిక: రాతపరీక్ష/ కంప్యూటర్ ఆధారిత పరీక్ష/ టెక్నికల్ ఇంటర్వ్యూ ఆధారంగా.
దరఖాస్తు ఫీజు: రూ.800.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 08.04.2023.
వెబ్‌సైట్: https://www.sameer.gov.in/

ఐఐఐటీ-రాయచూర్‌లో..

రాయచూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటీ) 13 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: సంబంధిత స్పెషలైజేషన్‌లో పీహెచ్‌డీ. 1-3 ఏళ్ల పని అనుభవం ఉండాలి.
ఎంపిక: ఇంటర్వ్యూ ఆధారంగా.
దరఖాస్తు: ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
ఈమెయిల్: faculty.app@iiitr.ac.in
దరఖాస్తుకు చివరి తేదీ: 31.03.2023.
వెబ్‌సైట్: https://iiitr.ac.in/

టీసీఐఎల్, న్యూదిల్లీలో..

న్యూదిల్లీలోని టెలికమ్యూనికేషన్స్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ (టీసీఐఎల్) ఝార్ఖండ్ రాష్ట్రంలో 88 ఐసీటీ ఇన్‌స్ట్రక్టర్ నియామకాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.
అర్హత: సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, పీజీ డిప్లొమా, పీజీతో పాటు అనుభవం.
వయసు: 18 నుంచి 55 సంవత్సరాల మధ్య ఉండాలి.
ఎంపిక: ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, స్కిల్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 18/03/2023.
వెబ్‌సైట్: www.career-tcil.com/

ఎయిమ్స్ దేవ్‌గఢ్‌లో..

ఝార్ఖండ్ రాష్ట్రం దేవ్‌ఘర్‌లోని ఎయిమ్స్ వివిధ విభాగాల్లో తాత్కాలిక ప్రాతిపదికన 21 సీనియర్ రెసిడెంట్ (నాన్ అకడమిక్) పోస్టుల నియామకానికి ఆఫ్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.
అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ/ ఇన్‌స్టిట్యూట్ నుంచి పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ (ఎండీ/ ఎంఎస్/ డీఎన్‌బీ).
వయసు: 45 సంవత్సరాలు మించకూడదు.
ఎంపిక: ఇంటర్వ్యూ, రాత పరీక్ష ఆధారంగా.
దరఖాస్తు రుసుము: జనరల్ అభ్యర్థులకు రూ.3000, ఓబీసీలకు రూ.1000.
ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఎయిమ్స్ దేవ్‌గఢ్ వెబ్‌సైట్‌లలో ప్రకటన వెలువడిన తేదీ నుంచి 15 రోజులలోపు దరఖాస్తు చేసుకోవాలి.
ప్రకటన తేదీ: 07.03.2023.

అప్రెంటిస్‌షిప్

కాల్కామ్ విజన్ లిమిటెడ్‌లో..

గ్రేటర్ నోయిడాలోని కాల్కామ్ విజన్ లిమిటెడ్ ఏడాది అప్రెంటిస్‌షిప్ శిక్షణలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.
డిప్లొమా అప్రెంటిస్: 210 ఖాళీలు
విభాగాలు: మెకానికల్ డిప్లొమా, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, ఈఈఈ డిప్లొమా, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజినీరింగ్.
అర్హత: 2020/ 2021, 2021/ 2022, 2022/ 2023 విద్యా సంవత్సరాల్లో సంబంధిత విభాగంలో డిప్లొమా (ఇంజినీరింగ్ లేదా టెక్నాలజీ) ఉత్తీర్ణులై ఉండాలి.
నెలవారీ స్టైపెండ్: రూ.11000.
ఎన్‌ఏటీఎస్ పోర్టల్‌లో వివరాల నమోదుకు చివరి తేదీ: 25.03.2023.
కాల్కామ్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ: 30.03.2023.
వెబ్‌సైట్: http://portal.mhrdnats.gov.in/

ఇంటర్వ్యూ

**యూహెచ్ క్యాంపస్ స్కూల్‌లో టీచర్